



నయా జోష్

2024 HAPPY NEW YEAR



• నగరంలో చిన్నారుల సంబురాలు









• కేక్ కొనుగోలు చేస్తున్న దృశ్యం

- అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు
- జిల్లాలో అర్ధరాత్రి వరకు కొనసాగిన వేడుకలు
- కేక్‌లు, నాన్‌వెజ్‌కు భారీగా డిమాండ్
- ఉదయం నుంచే వైన్‌షాపుల ఎదుట క్యూ
- ఆదివారం కలిసి రావడంతో అంతటా ఫుల్ జోష్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: కొత్త ఆశలు... కొత్త ఆలోచనలతో నూతన సంవత్సరం 2024కు జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు చేసుకొని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఒకచోట చేరి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సర వేడుకలు జిల్లా ప్రజల్లో నూతన జోష్‌ను నింపాయి. ఆదివారం కలిసి రావడంతో సాయంత్రం నుంచే పార్టీలు చేసుకున్నారు. బిల్డింగ్‌లపై డీజే నృత్యాలు పెట్టి డ్యాన్సులు చేస్తూ యువత కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి డ్యాన్సులు చేస్తూ యువత రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. కొత్త సంవత్సరం జోష్‌తో పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ యువతీ యువకులు ఆనందంగా గడిపారు. కేకులు, స్వీట్ షాపులు, మద్యం దుకాణాలు, మాంసం, ఇతర దుకాణాలు కొనుగోళ్లతో సందడిగా మారాయి. రోడ్లపై కేక్‌లు అమ్మకాలు, తినుబండరాల అమ్మకాల జోరు కనిపించింది. ఎక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రాత్రి సమయాల్లో రోడ్లపై పెట్రోలింగ్ నిర్వహించారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంగ్ల నామాది నూతన సంవత్సరం పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు పూలబొకేలకు బదులుగా నోట్‌బుక్స్, పెన్నులు, దుప్పట్లు తీసుకురావాలని ఆయన కోరారు. వాటిని విద్యార్థులకు అందించడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.





• మల్లన్న స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వైభవంగా మల్లన్న కల్యాణం

బోధన్ రూరల్, డిసెంబరు 31: మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో ఆదివారం మల్లన్న కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఊట్‌పల్లి గ్రామంలోని మల్లన్నగుట్టపై వెలసిన పద్మావతి మల్లన్న ఆలయం భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఈ సందర్భంగా ఊట్‌పల్లి గ్రామస్థులు 51 కడలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లతో, మంగళహారతులతో మల్లన్న గుట్టపైకి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. జాతర సందర్భంగా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మంగళహారతులతో మల్లన్న గుట్టపైకి వెళుతున్న భక్తులు



వేతన వెతలు!



• జాతీయరహదారిపై నిలిచిన వాహనాలు

• సింగిల్ రోడ్డుపై ఇబ్బందులు ఇలా..

ప్రయాణం సాగేదెలా?

- మామిడిపల్లి వద్ద సింగిల్‌రోడ్డుతో అవస్థలు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- నాలుగేళ్లుగా సాగుతున్న ఆర్‌వోబీ నిర్మాణ పనులు



రైల్వేబ్రిడ్జి వద్ద గుంతల మయమైన రోడ్డు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 31: ఆర్మూర్, నిజామాబాద్‌ల మధ్య గల ఆడవిమామిడిపల్లి వద్ద వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాలుగేళ్లుగా సాగుతున్న ఆర్‌వోబీ నిర్మాణ పనులతో రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. తరచూ పనుల జాప్యం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 63వ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. అయితే నిర్మాణ పనుల కారణంగా ప్రత్యామ్నాయంగా వేసిన సింగిల్ రోడ్డుపై రాకపోకలకు అవస్థలు తప్పడ లేదు.

సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు

రైల్వేబ్రిడ్జి పనులు చేపట్టడంతో ఒక వైపు నుంచి వాహనాలు వెళ్లడానికి సింగిల్‌రోడ్డు మాత్రమే వేశారు. ఇరుకు రోడ్డుపై ఇరువైపులా వాహనాలు వెళ్లాలంటే కష్టంగా మారింది. దీనికి తోడు భారీ వాహనాలు రావడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ప్రత్యామ్నాయంగా వేసిన సింగిల్ రోడ్డు కూడా గుంతల మయంగా మారింది. దీనికి తోడు రోడ్డు పక్కనే పొలాల్లో గుంతలుగా ఉండడం, కల్వర్టు ఉండడం కూడా వాహన చోదకులకు ఇబ్బందిగా మారి భయంభయంగా వెళ్లాల్సి వస్తుంది. పెద్దపల్లి, నిజామాబాద్ రైల్వే లైన్ ద్వారా అనేక రైళ్లు వెళ్తుంటాయి. ముఖ్యంగా గూడ్స్ రైళ్లు వెళ్తుంటాయి. రైలు వచ్చే సమయంలో గేటు మూయడంతో ఇరువైపులా అనేక వాహనాలు నిలిచిపోయి రైలు వెళ్లిన అనంతరం వాహనాలు కదలడానికి చాలా సమయం పడుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు రూ.15కోట్లు మంజూరు చేసినప్పటికీ నిధులు పక్కదారి మళ్లడంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శలు విన వస్తున్నాయి.

గుంతల మయమైన రోడ్డు

మామిడిపల్లి బస్టాండ్ వైపు రైల్వే బ్రిడ్జికి ఇరు వైపులా రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు సైతం గుంతల నుంచి వెళ్లడానికి డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ఇరువైపులా తాత్కాలికంగా తారురోడ్డు వేస్తే ఒక వైపు సమస్యలు కొంత వరకైనా దూరమయ్యేవి. సంబంధిత అధికారులు అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రతీ వాహనదారుడు అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి అధికారులు గుంతలు పూడ్చి డబుల్‌గా మారిస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

- ఐదు నెలలుగా వీఆర్‌ఏలకు అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో తప్పని అవస్థలు
- విధులు బహిష్కరించిన వీఆర్‌ఏలు
- జిల్లాలో 1643 మంది వీఆర్‌ఏలు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: రెవెన్యూ శాఖ నుంచి గత ప్రభుత్వం వీఆర్‌ఏలను ఇతర శాఖలకు కేటాయించి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించినప్పటికీ గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రా మ రెవెన్యూ సహాయకులుగా ఉన్న వీఆర్‌ఏలను గత ఆగస్టు 8న అప్పటి ప్రభుత్వం శాశ్వ త ఉద్యోగులుగా గుర్తిస్తూ రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు కేటాయించారు. ఆ సంతోషం వీఆర్‌ఏలలో కొద్దికాలమే ఉంది. వీఆర్‌ఏల సర్వీసును క్రమబద్ధీకరించినప్పటికీ కేటాయించిన శాఖలో కానీ, పాత రెవెన్యూ శాఖ నుంచి కానీ వేతనాలు మాత్రం ఇవ్వడం లేదు. జిల్లాలో 1643 మంది వీఆర్‌ఏలు ఉండగా 201 మంది వీఆర్‌ఏలను ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. ప్రస్తుతం ఇతర శాఖల్లో పనిచేస్తున్న వీఆర్‌ఏలకు కనీస ఉద్యోగులుగా కూడా గుర్తించకుండా వేతనాలు ఇవ్వకపోవడంతో వారంతా ప్రస్తుతం విధులను బహిష్కరించారు.

ఇతర శాఖలకు కేటాయింపులు

వీఆర్‌ఏలను ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసింది. జిల్లాలో ఉన్న ఖాళీ ఉద్యోగాల కంటే ఎక్కువగా వీఆర్‌ఏలు ఉండగా, 201 మంది వీఆర్‌ఏలను ఇతర జిల్లాలకు కేటాయించారు. మిగిలిన వారిని జిల్లాలోని వివిధ శాఖల్లో కేటాయించారు. అందులో 61 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, 140 మందిని రికార్డు అసిస్టెంట్లుగా నియమించారు. కొంత మందిని రెవెన్యూ, ఇంటర్మీడియెట్, విద్యాశాఖ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా గ్రంథాలయ సంస్థ, తదితర శాఖల్లో కేటాయించారు. కేటాయించిన శాఖల్లో ఇంకా ఉద్యోగులకు ఎంప్లాయిస్ కోడ్ రాకపోవడంతో వేతనాలు రావడం లేదు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించగా పే స్కేల్‌ను ఇంకా నిర్ణయించలేదు. ఆ ప్రభు త్వం ప్రస్తుతం మారడంతో వీఆర్‌ఏల పరిస్థితి దారుణంగా మారిం ది. గత ప్రభుత్వానికి చెప్పుకుందామన్న వినేవారు లేకపోవడం కొత్త ప్రభుత్వం తమను ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలని వీఆర్‌ఏలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విధులు బహిష్కరించిన వీఆర్‌ఏలు

ప్రస్తుతం వివిధ శాఖల్లో పని చేస్తున్న వీఆర్‌ఏలు తమ విధులను బహిష్కరించారు. గత ఐదు నెలలుగా వేతనాలు రాకపోగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఎలాంటి గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. డిసెంబర్ 14న వీఆర్‌ఏలు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు కేటాయించిన శాఖల్లో వేతనాలు ఇప్పించాలని లేదా రెవెన్యూ శాఖలోనే ఉంచి పేస్కేల్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గైని దయాసాగర్ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు ఉద్యమబాట పట్టారు. ఏళ్లుగా ఉద్యమాలు చేసిన తమను ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పటికీ ఆ ఉత్సాహం కొన్ని రోజులు మాత్రమే మిగిలిపోయిందని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీసిన తమకు ప్రస్తుతం ఐదు నెలలుగా వేతనాలు అందక కుటుంబం గడపడం కూడా కష్టంగా మారిందని కొత్త ప్రభుత్వం తమ గోడును పట్టించుకోని వేతనాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీఆర్‌ఏల వేతనాలను వెంటనే చెల్లించాలి..

వీఆర్‌ఏలకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించడంతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ 2లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏల వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖలకు వారిని బదిలీ చేసిందని కానీ అప్పటి నుంచి వేతనాలు రావడం లేదన్నారు. ఉన్న వేతనం ఇవ్వకపోగా కొత్త శాఖల్లో పనిచేస్తున్న ఆ వేతనం కూడా రావడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. డిసెంబరు 30, 2023 నాటికి 60 సంవత్సరాలు పూర్తయిన వీఆర్‌ఏలకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ 2లక్షలు ఇవ్వాలన్నారు. సమావేశంలో దేవేందర్, ఆనంద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు

మోర్తాడ్, డిసెంబరు 31: మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం మోర్తాడ్‌లో ఉదయం ప్రజాభవనంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జ్యోతిబా పూలే పాఠశాలలోని విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, తీగెల సంతోష్, మనోహర్‌రెడ్డి, పుప్పాల అశోక్, అర్గుల రమేష్, కుదురుపాక ప్రవీన్, జైడి గంగారాం, నజీర్, జక్కం అశోక్, సుదీర్‌నాయక్, గురువయ్య, రాజేందర్, పాలెం, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో వికసిత భారత్ ప్రచారం

డిచ్‌పల్లి, డిసెంబరు 31: కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ గత పదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం కోసం తీసుకున్న పథకాలను వివరిస్తూ ఆదివారం సుద్దపల్లి గ్రామంలో వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పానుగంటి రూప సతీశ్‌రెడ్డి హాజరై గ్రామంలో 2024 నూతన బీజేపీ క్యాలండర్‌లను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ద్వారానే పేద ప్రజలకు ఉన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోషం, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.85వేల నగదు, 20సెల్‌ఫోన్లు స్వాధీనం

ఖిల్లా,డిసెంబరు 31:పేకాటస్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రెండు వేర్వేరు చోట్ల దాడులు చేసి మొత్తం రూ.85వేల నగదు, 20సెల్‌ఫోన్లు స్వా ధీనం చేసుకున్నారు. కచ్చితమైన సమాచారం మేరకు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఆదేశాల మేరకు అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (లా అండ్ ఆర్డర్) జయరాం నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖరరాజు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు సిబ్బందితో రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో, నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ల పరిధుల్లో దాడులు చేశారు. ఈదాడుల్లో పేకాట ఆడు తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుకు రూరల్ పోలీసు స్టేషన్ పోలీసులకు, మూడో టౌన్ పోలీసులకు అప్పగించారు.

యువతి అదృశ్యం

బోధన్ రూరల్, డిసెంబరు 31:బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన గోదావరి అనే యువతి శనివారం కాలేజీకి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చుట్టూ పక్కల, కుటుంబ సభ్యుల ఇళ్లలో వెతికినా యువతి ఆచూకీలభించలేదని పేర్కొన్నారు. యువతి తండ్రి సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని, సీసీ పుటేజీల ద్వారా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డూప్లికేట్ ప్రొసీడింగ్‌లు ఇచ్చి ఓట్లు దండుకున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి

భీమ్‌గల్ రూరల్, డిసెంబరు31: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల ముందు డూప్లికేట్ ప్రొసీండింగ్ కాపీలను అంటగట్టి ప్రజలనుంచి ఓట్లు దండుకున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి ఆరోపించారు. ఆదివారం భీమ్‌గల్, వేల్పూర్ మండలంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇచ్చినటువంటి పనులపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పనులు జరగకుండా ఆపుతుందని అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచరులు ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమలో ఉన్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం లో జరిగిన ప్రతి ఒక్క అవినీతిని, భూదందాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ బయట పెడతారనిస్వామి అన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, దామోదర్ గౌడ్, మజీద్, నవీన్, పల్లె శేఖర్,నల్లూరి శీను, కుర్తీలాల్, సేవాలాల్ మండల కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎఫ్‌సీఎస్ ఆధ్వర్యంలో చేపలు విక్రయం

మోర్తాడ్, డిసెంబరు31: మండల కేంద్రంలో ఆదివారం ప్రాథమిక మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు చేపలు విక్రయించారు. స్థానిక సర్పంచ్ బోగ ధరణి ఆనంద్, వీడీసీ చైర్మన్ జేసి గంగారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. మహిళా అధ్యక్షురాలు మగ్గిడి లక్ష్మీబాయి మాట్లాడుతూ ఎఫ్‌సీఎస్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు నాణ్యమైన చేపలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఎస్ మహిళా అధ్యక్షురాలు మగ్గిడి లక్ష్మీబాయి, మహిళ డైరెక్టర్లు సులోచన, లలిత, శ్రావణి, లావణ్య, శ్యామల, అనసూ య, సంఘ సభ్యులు సంగీత, లక్ష్మి, అక్షర, నిర్మల, రజిత, ఉమ, గంగపుత్ర సంఘ సభ్యులు కవి, అంజయ్య, శశి, మగ్గిడి శంకర్, గంగామోహన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



చేపల వ్యాపారం ప్రారంభించిన ఎఫ్‌సీఎస్ మహిళలు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు నగర చిన్నారి ఎంపిక

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: మూడేళ్ల చిన్న వయస్సులోనే స్కూల్‌కు వెళ్లకుండానే ఇంట్లోనే ఉంటూ విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించిన నగరానికి చెందిన బాస చైత్ర అరుదైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచ్చీవర్ అవార్డును సాధించింది. నగరంలోని గాయత్రీనగర్‌కు చెందిన చైత్ర 17 జాతీయ పండుగలను, 12 జాతీయ గుర్తులను, 13 అంతరిక్ష వస్తువులను, 26 శరీర భాగాలను, 26 రకాల జంతువులను, 22 రకాల కూరగాయలను, 21 పండ్లను, 13 రంగులను, 8 రకాల ఆకారాలను, 26 అల్ఫాబెట్‌లకు సంబంధించిన వస్తువులను, 11 ఇంగ్లీష్ రైమ్స్‌ను ధారళంగా తడబడకుండా చెప్పేప్రతిభ కలిగి ఉంది. చిన్నారి ప్రతిభను గుర్తించి ఐబీఆర్ సంస్థ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రతిభను చూసి ఈ అవార్డును అందజేశారు.



ఇండియా బుక్ రికార్డ్స్ అవార్డు పొందిన చైత్ర

వేడెక్కిన మున్సిపల్ రాజకీయం

● క్యాంప్‌లకు వెళ్లిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు
● బీజేపీ కౌన్సిలర్‌లదే ప్రధానపాత్ర
● అవిశ్వాస పరీక్ష నెగ్గెనా..? వీగేనా..?

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు31: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్‌పై పెట్టిన అవిశ్వాస పరీక్ష జనవరి 4న ఉండడం తో కౌన్సిలర్‌ల మద్దతు కోరుతూ రాజకీయం వేడెక్కింది. సపక్షంలో విపక్షం ఏర్పడడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 24మంది కౌన్సిలర్‌లు డిసెంబరు 12న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాసం పెట్టాలని వినతిపత్రం అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ జనవరి 4వ తేదీని ఖరారు చేస్తూ ప్రతీకౌన్సిలర్‌కు నోటీసులు అందజేశారు. 13 నెలల పదవి కాలం ఉండడంతో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సహకారంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు వన్నెల్‌దేవి లావణ్య, ఖాందేశ్ సంగీతలు చైర్‌పర్సన్ సీటును ఆశీస్తున్నారు. అవిశ్వాసం విగిపోకుండా నెగ్గాలనే సంకల్పంతో మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచన మేరకు ఇద్దరు కౌన్సిలర్‌లు ఒక్కటై తమకు మద్దతు ఉన్న కౌన్సిలర్‌లతో క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఇదీలా ఉండగా అవిశ్వాస పరీక్ష కొరకు జిల్లా కలెక్టర్‌కు కౌన్సిలర్‌లు నోటీసులు అందిస్తున్నప్పటి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పవన్ తమకు మద్దతుగా ఉన్న కౌన్సిలర్‌లతో క్యాంప్ నిర్వహిస్తున్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతతో కలిపి ఎనిమిది మంది కౌన్సిలర్‌లు ఉండగా చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 20మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. ఇద్దరు కౌన్సిలర్‌లు ఏటు మద్దతు తెలుపకుండా అవిశ్వాస పరీక్ష రోజే ఆలోచిస్తామని అంటున్నారు. దీంతో జనవరి 4న ఉన్న అవిశ్వాస పరీక్షకు బీజేపీ కౌన్సిలర్‌లదే ప్రధానపాత్ర ఏర్పడింది. మొన్నటి వరకు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, మరిది పనితీరును వ్యతిరేకించిన కౌన్సిలర్‌లు ఎవరికి మద్దతుగా నిలుస్తారోనని, తమ వార్డులలో అభివృద్ధి కుంటు పండుతుందని, ఎన్నో సమావేశాలను బహిష్కరించినవారు ఇప్పుడు ఏటువైపు ఉంటారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అలాగే 2022 జనవరి 25న ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై దాడి ఘటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ మరిది పండిత్ ప్రేమ్ ఉన్న వీడియో బీజేపీ సోషల్ మీడియాలో వైరల్‌గా వస్తోందని వాటిపై కార్యకర్తలు సైతం కామెంట్లు పెడుతున్నారనే సమా చారం. ఈ అవిశ్వాస పరీక్షకు బీజేపీ కౌన్సిలర్ లు మద్దతు తెలుపుతారా లేదా కార్యకర్తలు సైతం ఎదురు చూస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం

అనుమానాస్పద వ్యక్తి వద్ద కత్తి లభ్యం

● రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బోధన్ రూరల్, డిసెంబరు 31: బోధన్ పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఫైజల్ అనే వ్యక్తిని పోలీసులు విచారించి తనిఖీ చేయగా అతని వద్ద ఒక పదునైన కత్తి లభించిందని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. శనివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరగడంతో అతడి వద్ద నుంచి కత్తి లభ్యం కావడంతో అతడిపై కేసు నమోదు చేసిరిమాండ్‌కు తరలించామన్నారు. కత్తితో ఇతరులకు భయభ్రాతులకు గురి చేస్తున్నాడన్నారు. అదే విధంగా పట్టణంలో ప్రతిరోజూ రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగు తోందని, అనుమానాస్పద వ్యక్తులుసంచరిస్తే ప్రజలు పోలీసులకు స మాచారం అందించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్క రు కృషి చేయాలన్నారు. కత్తితో తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకోవడంతో ఎవరికైనా ప్రాణాపాయం తప్పిందని స్థానికులు పేర్కొంటు న్నారు. పోలీసుల పనితీరును బోధన్ ఏసీపీ అభినం దిం చారు.

నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, డిసెంబరు 31: తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరం ప్రతి ఒక్కరికీ శుభాలు చేకూర్చాలని ప్రతీ కుటుంబంలో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు.

ఖతర్‌లో గుండెపోటుతో వెంకట్ మృతి



మోపాల్, డిసెంబరు 31: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన వేముల వెంకట్ శనివారం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. 18 ఏళ్ల క్రితం బతుకు దెరువు కోసం వెంకట్ ఖతర్ దేశానికి వెళ్లాడు. వెంకట్ కుటుంబాన్ని పోషించేందుకు బతుకుదెరువు కోసం ఖతర్ దేశానికి వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు. ఇతడికి భార్య స్వరూప, కొడుకు శ్రీనివాస్, కుమార్తె ఈశ్వరి ఉన్నారని తెలిపారు. మృతదేహం రాకకోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

లంగ్డాపూర్ గ్రామానికి శవ పేటిక అందజేత

బోధన్ రూరల్, డిసెంబరు 31 : బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రా మంలో ఆదివారం గ్రామస్థుల సహాయార్థం శవపేటికను అందజే శారు. గ్రామానికి చెందిన రాణంపల్లి రవి దాత తన తండ్రి దివంగత రాములు జ్ఞాపకార్థం శవపేటికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పవన్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, గంగాధర్, సుధాకర్, శ్రీనివాస్ పటేల్, సుంకరి లక్ష్మణ్, ఆనంద్ పటేల్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు



గాయపడిన శ్రీరాం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా గాలిపటం ఎగరవేస్తున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన ఆదివారం నిజామాబాద్ నగరంలో జరిగింది. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన శ్రీరాం (9) తన ఇంటిపై గాలిపటం ఎగరవేస్తుండగా అది విద్యుత్ వైర్లకు తగలడంతో దానిని అందుకునే క్రమంలో ప్రమాదవశాత్తు శ్రీరాం విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన జరిగిన అనంతరం బంధువులు బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని డాక్టర్లు చెప్పడంతో బాలుడిని హైదరాబాద్‌కు తరలించారు. 60శాతంకు పైగా బాలుడికి కాలిన గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. తమ ఇంటికి సమీపంలో విద్యుత్ వైర్లు ఉన్నాయని వాటిని తొలగించాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా తొలగించలేదని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు బాలుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతూ రాజు మృతి

మోపాల్, డిసెంబరు 31: కన్న కూతురు పెళ్లికి భార్య చెప్పలేదని మనస్తాపంతో భర్త రాజు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే.ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు ఆదివారం మరణించినట్లు మోపాల్ పోలీసులు తెలిపారు.

ప్రహసనంగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ

● ఆగస్టులో కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం ... తాజాగా మళ్లీ ప్రారంభించిన సీఎం రేవంత్
● నెలల వ్యవధిలో రెండు సార్లు ఆర్భాటంగా కార్యక్రమం ● అయినా విద్యార్థులకు అందని ల్యాప్‌టాప్‌లు
● ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం యూనివర్సిటీ అధికారుల పాకులాట

బాసర, డిసెంబరు 31:నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు లాప్‌టాప్‌ల పంపిణీ ప్రహసనంగా మారింది. ల్యాప్‌టాప్‌ల పంపిణీని వరుసగా ఆర్భాటంగా ప్రారంభింపజేస్తున్నా అధికారులు వాటిని మాత్రం విద్యార్థులకు అందివ్వకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఒకేసారి కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లలను మొదట మంత్రి కేటీఆర్‌తో పంపిణీని ప్రారంభించడం తాజాగా మళ్లీ ఆ ల్యాప్‌టాప్‌లనే ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డితో అర్భాటంగా పంపిణీని చేయించడం అధికారుల తీ రుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పెద్ద మెప్పు కోసమే అధికా రులు ఈ పని చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులకు అందించేందుకు ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో 1500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారు. ఈ కొత్త ల్యాప్‌టాప్‌లను ఆగస్టు నెలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ ప్రారంభోత్సవానికి వచ్చిన అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌చే ల్యాప్‌టాప్‌ల పంపిణీని యూనివర్సిటీ అధికారులు ప్రారంభించారు. కొంత మంది విద్యార్థులను నిజామాబాద్‌కు పిలిపించి ఆర్భాటంగా ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఇక విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందుతాయనుకున్నారు. కానీ రేపుమాపంటూ వాయిదా వేశారు. ఇంతలోనే ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఇక ప్రభుత్వంలో కొలువు దీరిన విద్యాశాఖ మంత్రిచే ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేయించా లని పెండింగ్‌లో ఉంచారు. విద్యార్థులకు లాప్‌టాప్‌లను అందివ్వలేదు. విద్యార్థులు, అధ్యాపకుల నుంచి అత్యవసరం ఏర్పడ్డా, ఒత్తిడి వచ్చినా కొనుగోలు చేసిన లాప్‌టాప్‌లను బయటకు తీయలేదు. తప్పని పరిస్థితులు ఎదురవడంతో గత ఏడాది చదువు పూర్తి చేసుకొని బయటకు వెళ్లిన విద్యార్థులు ఉపయోగించిన లాప్‌టాప్‌లను కొంత మందికి మాత్రమే అందించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా లాప్‌టాప్‌లు లేకుండానే మిగిలిన విద్యార్థులు తమ చదువును కొనసాగించారు. కొత్తవి వస్తాయనుకున్న విద్యార్థులకు నిరాశ ఎదురైంది.

● మళ్లీ రెండోసారి సీఎం రేవంత్ రెడ్డి చేతి మీదుగా..

శనివారం హైదరాబాద్‌లో ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని యూనివర్సిటీ అధికారులు ఏర్పాటు చేశారు. కొంత మంది విద్యార్థులను హైదరాబాద్‌కు పిలిపించుకొని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆరు నెలల కిందట కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లను రెండోసారి పంపిణీని చేయించారు. ఒకేసారి కొనుగోలు చే సిన ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు ఇవ్వకుండా భద్రపరుస్తూ పలుమార్లు ప్రభుత్వ పెద్దలతో ప్రారంభించేలా చేయడం యూనివర్సిటీ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పదవుల కోసం .. నేతల వద్ద పాట్లు..

గత ప్రభుత్వ హయంలో నియమితులైన నామినెట్ పోస్టుల్లో ఉన్న వారిని ఈ ప్రభుత్వం తొలగిస్తూ వస్తుంది. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌ను ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జీ వీసీగా గత ప్రభుత్వం నియమించింది. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌ను ఆ పదవి నుంచి తొలగించింది. ప్రస్తుతం వీసీకి ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జీ బాధ్యతలు మాత్రమే ఉన్నాయి. ఇక ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ పదవి కాలం కూడా కొన్ని నెలల క్రిందటే ముగిసింది. కొత్త ప్రభుత్వం యూనివర్సిటీ ఉన్నతమైన ఈ పోస్టుల్లో కొత్త వారిఇ నియమిస్తుందనే వార్తలు రావడంతో యూనివర్సిటీ అధికారులు అప్రమత్తమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో బీజీగా ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే లాప్‌టాప్‌ల పంపిణీని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. యూనివర్సిటీ అంతర్గత సమావేశాల్లో సైతం కొందరు యూనివర్సిటీ ఉన్నతాధికారులు కొత్త ప్రభుత్వ పెద్దలతో ఉన్న పరిచయాలను సైతం తరచుగా ప్రస్తావిస్తున్నారంటే వీరికి పదవులపై ఎంత ధ్యాస ఉందో అర్థమవుతుంది.



తాజాగా లాప్‌టాప్‌లను విద్యార్థులకు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఆగస్టు 9న నిజామాబాద్ ఐటీ హబ్‌లో విద్యార్థులకు లాప్‌టాప్‌లను అందజేస్తున్న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్

అప్పుడు కొనుగోలు చేసినవే..

● సతీష్ కుమార్, డైరెక్టర్

ఆగస్టు నెలకంటే ముందు కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లే శనివారం నాడు పంపిణీ చేపట్టాం. కాకపోతే విద్యార్థులు మారారు. ల్యాప్‌టాప్‌లు పాతవే అయినా ఆ నాడు ప్రస్తుతం ఇంజనీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థులకు పంపిణీ చేశాం. తాజాగా ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పంపిణీ ప్రారంభించాం. కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లన్నింటిని త్వరలోనే అందరికి అందిస్తాం.

రేపు కబడ్డీ జూనియర్ క్రీడాకారుల ఎంపిక

సుభాష్‌నగర్, డిసెంబరు 31: కబడ్డీ జూనియర్ క్రీడాకారుల ఎంపికలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు కబడ్డీ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఆద్యాల లింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఉదయం 10గంటల నుంచి ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 సంవత్సరాల లోపు క్రీడాకారులు ఈ ఎంపికలకు అర్హులని తెలిపారు. బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలురు 70 కిలోలలోపు, బాలికలు 65 కిలోలలోపు 5-2-2004 తర్వాత జన్మించిన వారై ఉండాలని అన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన సర్టిఫికెట్, ఆధార్‌కార్డు ఒరిజినల్ వెంటతెచ్చుకోవాలని తెలిపారు.

రేపు ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం

నవీపేట,డిసెంబరు30: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 2న ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్‌ఈవో వెంకటేశ్వర్ రావు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆసుపత్రిలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో చైర్మన్ అధ్యక్షతన కమిటీ సభ్యులు చర్చించనున్నట్లు ఆయన వివరించారు.

అయ్యప్ప మహా పడిపూజ

కోటగిరి,డిసెంబరు30: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయ్యప్ప నామ స్మరణ మార్మోగింది. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

నవీపేట,డిసెంబరు30: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని గురు స్వామి సంజీవ రెడ్డి తెలిపారు. నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా మల్లన్నస్వామి జాతర


ఆలూర్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు31: ఆలూర్‌లో ఆదివారం మల్లన్నస్వామి (కండే రాయుడు) జాతర ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో తరలివచ్చి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మల్లన్నస్వామి ఆలయం చుట్టు రథం (పిడే) 21సార్లు ప్రదక్షిణ చేయించారు. రథాన్ని లాగడంలో భక్తులు, గ్రామస్థులు పోటీపడి ఉత్సాహం చూపారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. మల్లన్నస్వామి రెండో రథోత్సవం ఈనెల 7వ తేదీన నిర్వహిస్తామని వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్ తెలిపారు. వీడీసీ ఆధ్వర్యంలో జాతర, రథోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వీడీసీసభ్యులు, గ్రామస్థులు, తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే


మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: భారత ప్రధాన మంత్రి నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నగరంలోని 9వ డివిజన్ బీజేపీ ఖిల్లా మండల శాఖ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సుందర్ రాథోడ్ నివాసంలో ఆదివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కార్యకర్తలతో కలిసి వీక్షించారు. టిఫిన్ బైటక్ కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆయన వెంట నాయకులు లక్ష్మీనారాయణ, వీరేందర్, నాగరాజు, పవన్, తదితరులు ఉన్నారు.

పెండింగ్ చలాన్ల చెల్లింపులకు స్పందన

● ఐదు రోజుల్లో రూ.కోటీ 12లక్షల వసూలు

ఖిల్లా , డిసెంబరు 31:రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్లకు రాయితీలు ఇస్తూ ప్రకటించడంతో వాహనదారులు పెండింగ్‌లో ఉన్న చలాన్లకు విధించిన జరిమానను చెల్లిస్తున్నారు.వాహనదారుల నుంచి స్పందన వస్తుందని ఆ శాఖాధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం రూ.10కోట్ల మేర చలాన్లు పెండింగ్‌లో ఉండగా వాటిలో కేవలం ఐదు రోజుల్లోనే కోటీ 12లక్షల 85వేల 175రూపాయలను వాహనదారులు చెల్లించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. ఈ ఏడాదిలో వివిధ రకాల వాహనాలకు ట్రాఫిక్ సిబ్బంది 7లక్షల కేసులు నమోదు చేశారు.ఇందులో ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌పార్కింగ్, సిగ్నల్ జంప్, అతివేగం, హెల్మెట్‌లేకుండా వాహనాలు నడపడం వల్ల ఆ శాఖ కేసులు నమోదు చేసింది. అందులో లక్షా 2వేల 880కేసులకు సంబంధించిన వాహనదారులు జరిమానా చెల్లించారు. గడువు ముగిసే సమయానికి సుమారు రూ.3కోట్ల వరకు పెండింగ్ చలాన్ల వాహనదారులు జరిమానా చెల్లించే అవకాశం ఉన్నట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.

ఆఫీసర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక


ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన శశిధర్‌రెడ్డి, అరవింద్‌కుమార్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఉపాధ్యక్షులుగా సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్‌లు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చిలువేరి సత్యం, జాయింట్ సెక్రెటరీగా వెంకట్రాములు, ట్రెజరర్‌గా రిటైర్డ్ ఎస్టీవో గంగాకిషన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఆఫీసర్స్ క్లబ్‌ను ఇతర ప్రాంతానికి తరలించకుండా ఇక్కడే ఉండేలా కాపాడుకుంటామన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహకారంతో ఆఫీసర్స్ క్లబ్‌ను యథాస్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాపోటీల నిర్వహణకు తోడ్పాటునందిస్తామని కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

బషీరాబాద్‌లో గంగా జలాల ఊరేగింపు


గంగా జలాలను ఊరేగిస్తున్న యాదవ సంఘ సభ్యులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 31: మండలంలోని బషీరాబాద్ దూల గుట్టపై కొలువుదీరిన యాదవుల ఆరాధ్యదైవం మల్లన్న స్వామి జాతర, ఆలయ వర్షికోత్సవం సందర్భంగా ఆదివారం గంగ నుంచి తరలించన పవిత్ర గంగాజలాలను, పుట్ట బంగారం గంగా జలలను గుట్టపైకి తరలించారు. ఇందులోభాగంగా గ్రామ యాదవ సంఘ సభ్యులు గంగజలాలను, పుట్ట మన్ను ప్రధాన వీధుల గుండా ఊరేగించి, గుట్టపైకి చేర్చారు. ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం బోనాల ఊరేగింపు, మల్లన్నస్వామి, గొల్ల కేతమ్మ, బలిజమేడాలమ్మ కల్యాణం జాతర, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమాలకు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని సంఘ అధ్యక్షుడు పెద్ద ముత్తెన్న కార్యదర్శి రాజు, సభ్యులు మల్కన్న, దేవన్న, సాగర్, సంపత్ , చిన్నయ్య, శేఖర్, బైకాని మహేష్, సామెర సుమన్, గ్రామ యాదవులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల మధ్య సంబరాలు జరుపుకోవాలి

ఖిల్లా , డిసెంబరు 31:ప్రజలందరూ శాంతిభద్రతల మధ్య 2024 నూతన సంవత్సరాల సంబరాలను జరుపుకోవాలని అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (లా అండ్ ఆర్డర్)జయరాం తెలిపారు. ప్రజలు నూతన సంవత్సర వేడుకలు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధి చెందాలంటే ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలు అనేవి చాలా ముఖ్యమైనవని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి అలజడులు అశాంతి లేకుండా ఉన్నప్పుడే మన రాష్ట్రానికి పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖకు సహకరించాలన్నారు. అలాంటి సమయంలోనే ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ మరింత ధృడంగా బలపడి ప్రజలకు పోలీసులకు మంచి సత్సంబంధాలు ఏర్పడుతాయన్నారు. చట్టానికి అనుగుణంగా ఉండే వారికి ఫ్రెండ్లీ పోలీసు చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ప్రజలకు 2024కొత్త సంవత్సరపు శుభకాంక్షలు తెలిపారు.

నవీపేటలో పోలీసు పికెటింగ్

నవీపేట: నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలోని మూడు చోట్ల పోలీసు పికెటింగ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. శివాజీ చౌక్, రాంపూర్ క్రాస్ రోడ్డు, బాసర క్రాస్ రోడ్‌లలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోలింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు కుంటామని తెలిపారు. ఇళ్లలలో వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో రాముడి అక్షింతల ఊరేగింపు

కోటగిరి,డిసెంబరు30: పొతంగల్ మండలం కొడిచర్ల గ్రామంలో ఆదివారం రాముడి అక్షింతలు ఊరేగించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం నుంచి వచ్చిన అక్షింతలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అక్షింతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పబ్బ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నవీపేటలో అక్షింతల పంపిణీ

నవీపేట,డిసెంబరు30: మండల కేంద్రంలో సోమవారం అయోధ్య రామ మందిరానికి చెందిన అక్షింతలను పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక హనుమాన్ మందిరంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లిలో ముత్యాల సనీల్‌కుమార్ జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 31: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సనీల్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండలపార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా నాయకులు కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేవలం ఎన్నికల్లో గెలవాలన్న ఉద్దేశంతోనే కులసంఘాలకు, ఇళ్లు లేని వారికి రూ.3లక్షల మంజూరుతో ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం మోసంచేసిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, పాలెపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, గనేస్ గౌడ్, బుచ్చిమల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, నల్ల సాయయికుమార్ శ్రీనివాస్, మారయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కమ్మర్‌పల్లి, డిసెంబరు 31: మండలకేంద్రంలోని గాంధీనగర్ వడ్డెర కాలనీకి చెందిన పల్లపు లక్ష్మి ఇటీవల బలవన్మరణానికి పాల్పడగా ఆమె కొడుకులు, కూతురికి బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రూ.5 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నగదును ఆదివారం కాంగ్రెస్ నాయకులు సుంకెట రవి, పాలెపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, మృతురాలి నాయనమ్మకు అందజేశారు. కార్యక్రమంలో బుచ్చిమల్లయ్య, మారయ్య, గణేష్ గౌడ్, కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముప్కాల్, డిసెంబరు31: మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు శాలివాహన దేవాదాయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు సోమవారం స్వామివారి మూల విరాట్‌లను గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి గోపూజ, అఖం దీపరాధన, గణపతి గౌరిపూజ, స్వస్తిక్ పుష్పహ, స్వస్తి పుణ్య అవాహన దీక్షధారణ, యాగ శాల ప్రవేశం, నవగ్రహ యోగిని, వాస్తు, క్షేత్రపాలక, హవనం నిర్వహించనన్నట్లు తెలిపారు. సాయంత్రం మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వితరణ జరుగుతాయన్నారు. మంగళవారం మండప హోమాలు, ప్రధాన దేవత జపాలు, సుదర్శన శ్రీలక్ష్మీనర్సింహస్వామి హవనం, సాయంత్రం కుంకుమార్చన, ధ్యాన, ఫల, పుష్ప, హోమాలు, పూజ, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వితరణ జరుగనున్నాయి. బుధవారం 3 గంటలకు ఉత్తర పాల్గుణ నక్షత్రయుక్త వృశిక లగ్న పుష్కరాంశ సప్తమి ముహార్తాన విగ్రహ శిఖర ప్రతిష్ఠాపన, మైత్రీమిలనం, బలిప్రదానం, మహా పూర్ణహుతి, మహాదా శిర్వవచనం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.190	రూ. 230
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.195	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.63,400	రూ.58,400	రూ.770

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సలార్ (11.25, 3.00, 6.35)
: సలార్ (హిందీ) (10.10)
స్క్రీన్-2 : డెవిల్ (11.40, 6.00)
: బబుల్‌గమ్ (2.50)
: సలార్ (9.10)
స్క్రీన్-3 : ఉమాపతి (12.00)
: హాయ్ నాన్న (3.30, 6.45)
: ఆనిమల్ (హిందీ) (10.00)
స్క్రీన్-4 : ధంకీ (హిందీ) (12.50, 6.50)
: సర్కారు నౌకరి (4.10)
: బబుల్‌గమ్ (10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-2 : సలార్ (10.20, 7.20, 10.30)
: హాయ్ నాన్న (1.30)
: డెవిల్ (4.25)
స్క్రీన్-3 : డెవిల్ (10.15, 7.30, 10.30)
: సలార్ (1.10, 4.20)

దేవి : డెవిల్ (11.15, 6.15, 2.15, 9.15)
లలితమహోల్ : సలార్ (11.00, 2.15, 6.00, 9.45)
నటరాజ్ : బబుల్‌గమ్ (11.00, 2.15, 6.00, 9.45)
విజయ్ : సలార్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్